క్లుప్తంగా

మహిళల భద్రతకే డీఎల్‌సీసీ



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఏయూక్యాంపస్: డిస్ట్రిక్ట్ లోకల్ కంప్లయింట్స్ కమిటీ (డీఎల్‌సీసీ) సమావేశం శనివారం దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రంలో నిర్వహించారు. కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఉష అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు డి.వెంకటేశ్వరి, డి.ప్రమీల గాంధీ, కె.స్వర్ణ కుమారి, ఎం.వి లక్ష్మిలు పాల్గొన్నారు. కమిటీ సమావేశంలో భాగంగా లోకల్ కంప్లయింట్స్ కమిటీని ప్రతీ సంస్థ కార్యాలయాలలో ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని చర్చించారు. 10 మందికంటే అధికంగా మహిళా ఉద్యోగులు కలిగిన ప్రతీ సంస్థలో డీఎల్‌సీసీని ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ సూచించారు. దీనికి సంబంధించిన చట్టాలపై మరింత అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

విద్యార్థుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగం విద్యార్థులు శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాగ విద్యార్థులు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. విభాగం ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఎండిన ఆకులు, తుప్పలు స్వయంగా తొలగించారు. ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలకు నీళ్లు పోశారు. ప్రతీ నెల చివరి శనివారం స్వచ్ఛంధంగా శ్రమదానం చేపడుతున్నారు. తద్వారా విభాగం చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే దిశగా కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు బి.వెంకట స్వామి, పెండ్యాల లావణ్య, విద్యార్థులు జి.బాబ్జీ, కె.సత్యనారాయణ, పి.కుసుమ, ఆర్.శ్రావణి, బి.అఖిల, వై.నాగరాజు, వై.సాయి, ఎం.సందీప్, కె.వీరన్న, కె.సాయి శివ తదితరులు పాల్గొన్నారు.

ట్రక్..టెన్షన్



ప్లాస్టిక్ వ్యర్థాల మూటలతో బీఆర్‌టీఎస్‌లో వెళుతున్న ట్రక్కు

ఆరిలోవ: ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోరు.. వెనుక వస్తున్న వాహనాల సంగతి మాకెందుకు అనుకుంటారు..ప్రమాదాలు జరిగితే అయ్యో అని అనుకోవడం తప్ప చర్యలు అంతంత మాత్రమే...ఆరిలోవ ప్రధాన రహదారిలో ఈ ట్రక్కు అధిక లోడుతో రయ్‌మని దూసుకుపోయినా ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోలేదు. ట్రక్ వెనుక ఉన్న వాహనదారులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. ట్రక్ ఊగుతూ అందులో ఉన్న సరుకు ఎక్కడ రోడ్డుపై పడుతుందోనని భయపడ్డారు. ప్లాస్టిక్ కుర్చీలు, వాటర్ బాటిళ్లు, టబ్‌లతో పాటు తుప్పుపట్టిన ఇనుప ఊచలూ ఉన్నాయి. ట్రక్కులో సుమారు 5 అడుగులకు పైగా మూటలు పేర్చేశారు. అధిక స్పీడ్‌తో సింహాచలం వైపు దూసుకుపోయింది.

మార్కెటింగ్ కీలకం

ఏయూక్యాంపస్ : వ్యాపారవేత్తలు తమ వస్తు ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం ఎంతో కీలకమని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంతో ఏపీ చాంబర్స్ మహిళా విభాగం సంయుక్తంగా నిర్వహించిన 'విమెన్ లెడ్ బిజినెస్ ప్రోస్పెక్టివ్ గ్రోత్ స్ట్రాటజీస్' సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్నవారు వ్యాపార రంగంలో వస్తున్న మార్పులు, సవాళ్లను గమనించాలన్నారు. సదస్సుకు లీ హెల్త్ డొమెన్ డైరెక్టర్ లీలా రాణి సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో శృతి వేదుల, ఆచార్య జోజ్యుల శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.

శభాష్..'టూరిస్ట్ పోలీస్'



మహిళలకు అవగాహన కల్పిస్తున్న టూరిస్ట్ పోలీసులు

- తీరంలో పెరిగిన రక్షణ
- పర్యాటకులకు భద్రతతో పాటు అవగాహన



బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

బీచ్‌రోడ్డు : పర్యాటకుల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. బీచ్‌రోడ్లో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు స్టేషన్ పర్యాటకులు భరోసాగా నిలుస్తోంది. ఈ నెల 14వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన టూరిస్ట్ పోలీసు స్టేషన్‌తో తీరంలో పర్యాటకులకు రక్షణ పెరిగింది. ముఖ్యంగా బీచ్ పెట్రోలింగ్ వాహనం వలన స్నానాలు చేస్తున్న వారికి రిప్‌కరెంట్, రాబోయే ప్రమాదాలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ప్రమాదాలకు గురికాకుండా రక్షణ కల్పిస్తున్నారు. భారీ కెరటాల మధ్యలోకి పర్యాటకులను పోనివ్వకుండా బీచ్‌గార్డ్స్ గస్తీ కాస్తున్నారు.

శివరాత్రి రోజు ప్రమాదాలు నిల్

ఏటా శివరాత్రి సందర్భంగా స్నానమాచరించే సమయంలో ప్రమాదాలు జరుగుతుండేవి. వేల సంఖ్యలో భక్తులు ఆర్కేబీచ్‌కు వచ్చే క్రమంలో అలల ధాటికి గల్లంతయ్యేవారు. కోస్ట్ గార్డ్ సిబ్బందికి కూడా అందర్నీ అలెర్ట్ చేసే అవకాశం ఉండేది కాదు. అయితే టూరిస్ట్ పోలీసు స్టేషన్ ఇటీవల ఏర్పాటు చేయడం..బీచ్‌లో గస్తీ కోసం ప్రత్యేక వాహనాలను కేటాయించడంతో ఈ ఏడాది శివరాత్రి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలూ చోటుచేసుకోలేదు. పైగా పదుల సంఖ్యలో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడంలోనూ టూరిస్ట్ పోలీసు స్టేషన్ పోలీసులు విశేషమైన పాత్ర పోషించారు.

పర్యాటకులకు అవగాహన

నగరానికి వచ్చిన పర్యాటకులకు మేమున్నామంటూ టూరిస్ట్ పోలీసు స్టేషన్ పోలీసులు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పిస్తున్నారు. నగర పర్యాటక ప్రాంతాల వివరాలతో పాటుగా రవాణా సౌకర్యం, చార్జీల వివరాలు, స్థానిక సేవలపై సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నారు.

మహిళలకు అండగా..

బీచ్‌కు సందర్శనకు వచ్చిన మహిళలకు ఈవ్ టీజింగ్, మహిళలపై అనైతిక చర్యల నుంచి రక్షణ, మహిళల భద్రత, మహిళ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, దిశ యాప్ వంటి వాటిపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలకు అండగా టూరిస్ట్ పోలీసు స్టేషన్ పోలీసులు నిలుస్తున్నారు.

ప్రత్యేక వాహన సేవలు బాగున్నాయి



గతంలో ప్రమాదాలను హెచ్చరించేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. మా గొంతు తీరంలో స్నానం చేసే వారికి అంతగా వినిపించేది కాదు. కానీ ఇప్పుడు బీచ్ ప్రెటోలింగ్ వాహనం వలన సులభంగా ప్రమాదాల హెచ్చరికలను పర్యటకులను తెలియజేస్తున్నాం. వాహనానికి స్పీకర్లు ఉండటం వలన మా సూచనలు తీరంలో స్నానం చేసేవారికి వేగంగా చేరుతున్నాయి. తద్వారా పర్యాటకులు అప్రమత్తమవుతున్నారు. 10 రోజుల్లో ఆర్కేబీచ్ పరిధిలో ఒక్క చిన్న ప్రమాదం కూడా చోటు చేసుకోలేదు.. దానికి టూరిస్ట్ పోలీసు స్టేషన్ ఎంతగానో ఉపయోగపడింది.

– పోలిరెడ్డి, బీచ్‌గార్డు

ప్రశాంత వాతావరణం

పది రోజుల్లో సుమారు 250 మంది పర్యటకులకు టూరిస్ట్ పోలీసు స్టేషన్ పోలీసులు రక్షణ కల్పించారు. మహా శివరాత్రి రోజున తప్పిపోయిన పిల్లలను వారి కుటుంబాలకు చేర్చటంలో టూరిస్ట్ పోలీసులు విశేష కృషి చేశారు. టూరిస్ట్ పోలీసు స్టేషన్ ద్వారా సందర్శకులకు తీరంలోని హెచ్చరికలతో పాటు భద్రతపరమైన అవగాహన కూడా కల్పిస్తున్నాం.

– కోరాడ రామారావు, సీఐ, త్రీటౌన్

వైద్య విద్యలో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైన ఎంబీబీఎస్ విద్యార్థుల జాబితాను విడుదల చేసింది. వీరిని శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ (అడ్మిన్) జి.రాజేంద్రప్రసాద్ అభినందించారు. ఏపీలోని మొత్తం 28 మెడికల్ కాలేజీల నుంచి 119 మంది విద్యార్థుల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన పది మంది విద్యార్థులు డిస్టింక్షన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఎంబీబీఎస్ అన్ని విభాగాల్లో బి.నందన్ 1925 మార్కులతో అత్యున్నత స్థానంలో నిలిచారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అల్లిపురం : దేశంలో ప్రధాన ఓడరేవుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డీకే శర్మ కేంద్ర షిప్పింగ్ కార్యదర్శి సుదాంష్ పంత్‌ను శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. అన్ని పోర్టులతో పాటు విశాఖ పోర్టులోను బోర్డు మెంబర్ల నియామకం జరగలేదని, తక్షణమే బోర్డు మెంబర్ల నియామకం చేపట్టాలని కోరారు.

అప్పన్న ధ్వజ స్తంభ స్వర్ణతాపడం పనుల్లో కదలిక

- రూ.కోటితో పనులకు
- సీఎంఆర్ అధినేత ఆమోదం



ధ్వజస్తంభం వద్ద పరిశీలన చేస్తున్న సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం స్వర్ణతాపడం పనుల్లో కదలిక వచ్చింది. కోటి రూపాయల వ్యయంతో ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ సంసిద్ధం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్ శనివారం సింహగిరికి వచ్చి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. ప్రస్తుతం రాగి రేకులతో ఉన్న ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు (రాగిరేకులపై బంగారుకోటింగ్ వేసేందుకు) గతేడాది సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ సంకల్పించారు. ఈమేరకు రూ.85లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎస్‌ఎఫ్‌టీకి 2.25గ్రాముల బంగారం వెచ్చించే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు. ఆ అంచాలను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కి అప్పట్లో పంపించారు. మరింత ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా స్వర్ణమయం పనులు జరగాలని కమిషనర్ సూచించారు. దీంతో కోటి రూపాయలతో ధ్వజస్తంభం పనులు చేయాలని సీఎంఆర్ అధినేత ముందుకు వచ్చారు. దీంతో శనివారం సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానం ఏఈ రాంబాబు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులతో కలిసి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. సంబంధిత ఎస్టిమేట్‌ను దేవదాయశాఖ కమిషనర్‌కు పంపించనున్నారు. అక్కడ నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

నాక్ పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు శుక్రవారం నాక్ పై అవగాహన సదస్సును నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ఐ.విజయబాబు తెలిపారు. సదస్సులో రీసోర్స్ పర్సన్ నాక్ పీర్ టీమ్ సభ్యుడు అక్కినేని నాగేశ్వరరావు, గుడివాడ రిటైర్డ్ ప్రిన్సిపాల్ అడ్వజర్ సిరిపురపు శంకర్‌లు వ్యవహరించారు. ఈసందర్భంగా అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతూ నాక్ అక్రిడేషన్‌కు వెళ్లబోయే కళాశాలలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాలలకు మంచి గ్రేడ్ పొందడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి సూచించారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ నాక్‌లో ఉత్తమ కళాశాల గుర్తింపునకు ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలని కోరారు. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ లలిత, ఐక్యూ కో ఆర్డినేటర్ కె.రవిబాబు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపునకు విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న బీసీ నాయకుడు పితాని ప్రసాద్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలంటూ రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, దాబాగార్డెన్స్‌తో పాటు పలు ప్రాంతాల్లోని కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం ఈ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనతో బీసీల అభ్యున్నతిలో వేగం పుంజుకుందన్నారు. ప్రతి అంశంలోను బీసీలకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 2019లో ఎమ్మెల్యే అభ్యర్థుల దగ్గర నుంచి ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల వరకు అన్నింటా బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. నేడు రాష్ట్రంలో అత్యధిక మంది బీసీ మంత్రులే ఉన్నారన్నారు. ఎన్నికల్లో బీసీలను పోటీలో నిలపడమే కాకుండా నామినేటెడ్ పదవుల్లోను అత్యధిక ప్రాధాన్యమిస్తూ బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం బీసీలకు ఇవ్వని సముచిత స్థానం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని కొనియాడారు. బీసీలంతా వైఎస్సార్ సీపీ వెంట ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి సుధాకర్ గెలుపు ఖాయమన్నారు. ఈ దిశగా పట్టభద్రుల్లో చైతన్యం నింపేందుకు బీసీ సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు కళాశాలల సైతం వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు విద్యార్థులను చైతన్యం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేంద్ర నాయుడు, అడ్వకేట్ రఘురామ్ నాయుడు, సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ వెంకట్‌నాయుడు, శ్రీధర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధి అజెండాలో భారత్ ప్రగతి



గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

ఆరిలోవ : వృద్ధి అజెండాలో భారతదేశం అగ్రగామిగా నిలవడానికి సిద్ధంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ఈఅండ్‌వై మేనేజింగ్ పాట్నర్ జయేష్ సంఘ్వీ తెలిపారు. నగరంలో ఓ హోటల్‌లో శనివారం జరిగిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సీఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచీకరణ, అవకాశాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణలు అనే అంశంపై మాట్లాడారు. డిజిటలైజేషన్ ఎకో సిస్టంను అందించిందన్నారు. దీంతో పాటు ఫార్మలైజేషన్ గవర్నెన్స్ సమస్యను పరిష్కరిస్తూ కొత్త వ్యాపార ఉత్పత్తుల సేవలను పెంపొందించిందన్నారు. దీనివల్ల సమర్థత, పోటీతత్వం పెరుగుతాయన్నారు. ఇది దేశంలో పెట్టుబడులను పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఉత్పత్తులు తయారీ, మౌలిక సదుపాయాల కల్పనలో భారతదేశం ముందుందన్నారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ డెలెవిరీ హెడ్ నర్రా సురేష్ మాట్లాడుతూ ఐటీ ల్యాండ్ స్కేప్‌లో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రాబ్లం సాల్వర్ నుంచి ప్రాబ్లం ఐడెంటిఫియర్ వరకు లోపం ఎక్కడ ఉందో అంచనా వేయలేకపోతున్నామన్నారు. ఇది పెద్ద సవాల్‌గా మారిందన్నారు.

సీఐఐ విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లు..

కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లను ఈ సమావేశంలో నియమించారు. సీఐఐ 2023–24 నూతన చైర్మన్‌గా విశాఖ ఫ్మాసిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ పి.పి. లాల్‌ను నియమించారు. వైస్ చైర్మన్‌గా ఇంటిగ్రేల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్ మేనేజింగ్ పార్టనర్ గ్రంధి రాజేష్‌తో పాటు మరికొందరు సభ్యులను నియమించారు.

27 నుంచి గాయత్రి కళాశాలలో 'శాస్త్ర 2023'

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి కళాశాలలో ఈ నెల 27, 28 తేదీలలో శాస్త్ర 2023 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సైన్స్ డేను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రజని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ కళాశాల విద్యార్థులు సైతం పాల్గొంటారన్నారు. విజ్ఞానం, ఆవిష్కరణలకు అనుగుణంగా ఆయా కళాశాల విద్యార్థులంతా వారి నమూనాలను ప్రదర్శిస్తారన్నారు. క్విజ్, డిబెట్, పోస్టర్ ప్రజంటేషన్, ఫ్యాషన్ షో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న కళాశాల సమావేశ మందిరంలో జరగనున్న ఈ ప్రారంభ కార్యక్రమానికి ఐఐపీఈ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 28వ తేదీ తుది గడువు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ కలిప్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

శిశువులందరికీ వ్యాక్సినేషన్

మహారాణిపేట: చినవాల్తేర్ సచివాలయం పరిధిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శని వారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్లానింగ్, శిశువుల జాబితా తయారు చేసుకోవాలని వాక్సిన్ కారియర్‌లో ఐస్ ప్యాక్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి బుధవారం, శనివారాల్లో క్రమంతప్పకుండా నూటికి నూరు శాతం శిశువులందరికీ వ్యాక్సినేషన్ జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విమ్స్‌లో హెపటైటిస్–బీ వ్యాక్సినేషన్ డ్రైవ్



విమ్‌లో సిబ్బందికి హెపటైటిస్ వేక్సిన్ వేస్తున్న వైద్యుడు

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో విమ్స్ సిబ్బందికి వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ హెపటైటిస్ బి. వైరస్ నుంచి రక్షణ కల్పించడానికి ఇక్కడ సిబ్బందికి వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రులలో పని చేసే సిబ్బందికి వేగంగా వైరస్ సోకే అవకాశం ఉన్నందున ఈ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సుమారు 400 మంది సిబ్బందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్, విమ్స్ ఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ఉన్నతికి సహకారం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్).. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం(కెమ్‌దోసా) ప్రకటించింది. కళాశాలలో కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రాంగణంలో పచ్చదనం అభివృద్ధికి రూ.50,000 విరాళాన్ని ప్రకటించారు. ప్రతిభావంతులకు నగదు బహుమతులు ఇచ్చేందుకు ప్రతి ఏడాది రూ.70,000 కేటాయిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ కెమ్‌దోసా సభ్యులు కాలేజీ అభివృద్ధికి చేస్తున్న సహకారం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, కెమ్‌దోసా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచారం చేస్తున్న రమాప్రభ

మద్దిలపాలెం : ఎమ్మెల్సీ ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కేఆర్ ఎంకాలనీలోని పార్కులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులైన ఓటర్ల తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పార్కులో వాకర్స్‌ను, సందర్శకులను ఆమె కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకుడు జి.ఎస్.రాజేశ్వరరావు, జి.వి.ఎన్.చలపతి, శివనాగేశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు సత్యనారాయణ, కె.జె.అప్పారావులు పాల్గొన్నారు.

'ఆహా హా ఏమి పద్యం' చానల్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న సూర్యారావు

సీతంపేట: నవసాహితీ ఇంటర్నేషనల్(చెన్నై) ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆహా హా ఏమి పద్యం' అనే చానల్‌ను డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ఆవిష్కరించి పద్య ప్రశస్తిని వివరించారు. చానల్ నిర్వాహకుడు అనంతరామ్, గౌరవ అతిథులు ఆచార్య జర్రా అప్పారావు, నందూరి రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన నవయుగ వైతాళికుడు కందుకూరి, గురజాడ కథల పుస్తకాలను డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ ఎం.సుబ్బారావులు సమీక్షించారు. నవసాహితీ అధ్యక్షుడు సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మాలతి, వై.సుధాకర్‌లు పర్యవేక్షించారు.

పోర్ట్ పెన్షనర్ల ధర్నా రేపు

మర్రిపాలెం: పోర్టు ట్రస్ట్‌పై కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావుతో కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మురళీనగర్, తెన్నేటినగర్, మాధవధార, కళింగనగర్ తదితర ప్రాంతాల్లోని పింఛనుదారులను కలిసి కరపత్రాలు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి అన్నవు నారాయణరావు, కె.గణేష్, పి.రామారావు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

రేపటి నుంచి యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనరల్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం : ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్ర ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ ప్రత్యేక యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భాను కుమార్ తెలిపారు.